ప్రణయత్యాగం

శ్రీమతి దంతుర్తి లక్ష్మీనరసమ్మగారు

అది జూన్ నెల. సాధారణంగా ఒక్కొక్క నెల ఒక్కొక్క విషయానికి ప్రాముఖ్యాన్ని చెందిఉంటుంది. జ్యేష్ఠమాసంలో ఆవకాయలు మామిడిపళ్లు అలికిరి; శ్రావణమాసంలో ముత్తైదువులయొక్కయు, కొత్త కోడళ్లయొక్కయు సందడి; కార్తీకమాసంలో వితంతువులస్నానాల అలికిరి; పుష్యంలో దశమగ్రహాలైన కొత్తల్లుళ్ళ సందడి; మాఘంలో పునఃసంధానాల అడావుడి. వీటిఅన్నిటికన్నా ఆందోళనచేసేది స్కూలు ఫైనలు వారిపరీక్షలు తెలిసేమాసం.

శీతారామయ్యగారు తన మేనల్లుడు ప్రసాదంపరీక్ష ఏమైందోఅని ఆతురతపడుతున్నారు. ఇంట్లో అతనిభార్య లక్ష్మీదేవి ఓవేపు పిల్లఅగుపద్మకు పెళ్లీడుమించుతూందని ప్రాణంకొరికేస్తూంది. అతనుప్రసాదం పరీక్షాఫలితమునుచూచి ఏదో నిశ్చయించేద్దాంఅని అనుకొంటున్నాడు.

జూను పదిహేనోతేదీ, ఆరోజు పోస్టుబంట్రోతు బీటుమీదవస్తాడు శీతారామయ్య తపాలబంట్రోతువాడికోసం ఊరికో మైలుదూరం ముందుపోయి ఎదుర్కొన్నాడు. ఉత్తరంకూడా అందుకొన్నాడు. అందుకొన్నాడు. దాన్నిచదవడంతోనే పొంగిపోయాడు. పోస్టుబంట్రోతుకు భోజనం శాంక్షన్‌చేసాడు. లక్ష్మీదేవి ఆనందానికి మేరలేదు. ఇంట్లోమాటలన్నీ జాగ్రత్తగా వింటూంది పద్మ. (చాలా తెలివైనపిల్లలెండి) ఆమెను ప్రసాదంబావ పరీక్షప్యాసు అయాడన్న సంగతి వినడంతోనే ఆనందబాష్పాలు జలజలరాలాయి. (ఎంతైన మేనత్త మేనమామ బిడ్డలుగదండి. వారి కుదయించు ప్రేమ సహజమైనది.) ఒంటరిగా గదిలోకిపోయి తనఆనందాన్ని పైకివెలిపీసింది ఒక్కసారిగా.

* *

'పద్మాప్రసాదం' ఎంతకర్ణానందగాఉంది ఆ జంటపేర. వారినిచూచిన లేనివారికి ప్రేమఉదయించును. ఆహా! ఎంతఅన్యోన్యంగాఉంటున్నారు. వారిరువురునూ నిరుపమానదంపతులే! లక్ష్మీశీతారామయ్యలకు ఇక కావలిసినదేమున్నది?

ప్రసాదం ఎఫ్. ఎల్. పరీక్షఅయిపోగానే వేసంగిలో ఇంటికొచ్చాడు. ఇంటిదగ్గర తనప్రేమఫలమగు 'సీతారామ్' బోసినోరుతో, బూరిబుగ్గలతో, చిరునగవులతో ఎదురుగా గుమ్మందగ్గరున్నాడు. రావడంతోనే చూచాడుచిట్టి 'శీతారామం'ను. పిల్లాడిని తప్పించుకుపోదామనుకొన్నాడు. కాని ఒకేసారిగా ఒంట్లోనెత్తురు పూర్ణిమనాడు అలలుచందాన్ని పొంగింది. తనకు తెలియకుండానే శరీరంవంగింది, చేతులు చాపబడ్డాయి. అమాంతగా పిల్లడు చంకెక్కాడు. 'శీతారాం'ను ఎన్నిసార్లు ముద్దుపెట్టుకొన్నాడో అతనికే తెలియదు. గట్టిగా

అదుముకొన్నాడు పిల్లడ్ని తనగుండెలకు. అట్లా తన్ను తానుమరచాడు కొంతవరకూ. అప్పు డాతనికి కలిగినసౌఖ్యం, అతనుపొందిన ఆనందం చెప్పడాని కలవిగాదు.

* * *

సాయంత్రం ఏటివైపు షైరుబయల్దేరాడు. నాగావళీపాయ కృష్ణత్రాచులా ప్రవహిస్తూంది. సన్నంగాపాట వెలువడ్తూంది ప్రసాదంహృదయంలోంచి. ఒంటరిగా కూర్చున్నాడో చోట. సూర్యుడు సాయంకాల సమయాన్ని తనకిరణాలను వెదజల్లుచూ నాగావళీతీరదృశ్యాన్ని అతిమనోరంగాను, అతిరమ్యంగాను చేసాడు. ఆ దృశ్యాలవెంట బడ్డాది ప్రసాదంయొక్కహృదయం. అతని బుర్రలో మితిలేనన్ని ఆలోచనలు పరుగెత్తున్నాయి.

అకస్మాత్తుగా ఆతనిమనోవీధిలో పరుగెత్తింది 'విమలా' రూపం — ఆ విశాలమైన ముఖంతో, ఆ వేడికన్నులతో, ఆ పలుచని ఎర్రనిపెదిమలతో, ఆ భుజాలుదాకా వేలాడేచెవులతూరీగలతో, ఆ పార్శికచ్చతో ఆ సుకుమారనడకతోనున్నూ, ఆతని హృదయం చలించింది. ఆమెకును తనకునూ మదరాసు సముద్రపుటొడ్డున జరిగినసంగతులు జ్ఞాపకానికొస్తున్నాయి. —— ఆమె విద్యార్థిక, తాను విద్యార్థికుడు, ఇరువురు ఒకర్నిమించినవారొకరు. నిష్కల్మషమైన ప్రేమ ఒకరిదొకరికి. ప్రపంచంలో కావల్సిన విక ఏమిటున్నాయి? ధనమా? కావలసినంత పుష్కలంగా ఉంది. ప్రేమా? అదియుకూడా నిరుపమానమైంది ఒకరిపై నింకొకరికి. రెండునూ అమిరియున్నాయే! నేనెందుకింక వెరువాలి ఆమెను స్వీకరించడానికి?

తన 'సీతారాం' మళ్లీ గోచరించాడు. అతనికి ఆశాసౌధం విమలతోకూడా కూలిపోయింది ఒక్కమారుగాను. తనస్థితిని తల్చుకొన్నాడు. తనవయస్సు 22 ఏండ్లా? ఇంకాచదువువైనా పూర్తిగాలేదే! ఎంత సిగ్గు! ఎంతచిన్నదనం! నావిమల విన్నాదంటే ఏమనుకొంటుంది? ఎంతనవ్వుతుందో గదా? నేను చదువుకొన్నప్పటికిని విద్యాహీనమైన పశువువలె ప్రవర్తించేనే! మరీ జన్మలో నాకు ప్రణయసౌఖ్యంలేదా? ఈ జన్మ ఇంకనేను వృధాగా గడపవలసినదేనా? ప్రపంచంలో బ్రదకడం ఎందుకు? ఆనందం బొందడానికా? సౌఖ్యపడడానికా? లేక కుళ్లుతూకుముల్తూ దుఃఖపడడానికా?

'బాబయ్యా, ఏయాలొచ్చారండీ' అనే సాలికాపు వెంకడిపిలుపు ఆ తలప్పు చెదిర్చింది. 'చీకటిపడ్తూంది' అంటూ లేచాడు ఇంటికి.

* *

'వెళ్లి పదిహేనురోజులైందే! ఉత్తరమైనా రాలేదే! ఏంచెప్మా! ఎంతతెలివిమాలినదానను నేను! వారు ఉత్తరంవ్రాసిన గదా నాకువచ్చుట. ఉత్తరంవ్రాయకపోవడానికి ఏంకారణమైయుంటుంది? తీరుబాటులేకా? తీరుబాటులేకపోవుటకు చేయవలసిన పనులేమున్నవి? లేక నామీద కోపంచేతా? కోపానికి నేనేం అపరాధంచేసాను?

పోనీ నేనే ఏదైనాఅపరాథంచేస్తే క్షమించమని వ్రాస్తా' అంటూ లేచింది పద్మ పెరటిగచ్చు అరుగుమీదనుంచి పిల్లడ్ని చంకవేసుకొంటున్నా ఓనాడుసాయంత్రం.

రోజుకురోజూ ఆమె ముఖంలో కళలంతరిస్తున్నాయి. ఆమె కానందం గూర్చేఫలం ఒక్కటేఉందితనదగ్గర.అదే'శీతారాం' జీవప్రతిమ. ప్రసాదాన్ని తల్చుకొనేసరికి కళ్లు కాలుచలుకట్టి గుండె దడదడ హెచ్చింది, నెత్తురుచల్లబడ్డది, ఒళ్లల్లాపులకరించింది. ఏపనిచేసినాపరాకే అంతాకలలో జరుగుతూన్నట్టేయుండేది. తాను ఉత్తరం వ్రాసి పదిరోజులైంది జబాబులేదు. ఆందోళనం ఎక్కువైంది. ఏంచేయడానికి తోచలేదు. యింటఎవరు పెద్ద మొగదిక్కులేదు. అంచేత పుట్టింటికి ప్రయాణంకట్టింది మేనత్తతోటి అక్కడనుంచీ తనతండ్రిని మదరాసు పంపడానికి.

పేపర్లు ప్రకటించాయి 'విమలాప్రసాదుల' వివాహం. మదరాసు వారందరూ ఆ అంతశ్శాఖా వివాహానికి ఆనందిస్తూ దంపతుల్ని అభినందించేరు. ప్రపాదం బస ఇప్పుడు 'రామకృష్ణారావునాయుడు గారింట్లోనే'. అతను ఓ వృద్ధబారిష్టరు, ధనవంతుడు సంఘసంస్కారి. శాఖాహారనియమం కలవాడు. ఆతనిఒక్క కుమార్తెఅగు విమలను ఆమె ఇష్టంపైని ప్రసాదాని కర్పించాడు. అతని ఆనందానికి మేరేలేదు, తాను తన విమలకు స్వేచ్ఛావివాహం చేసేనన్న గర్వంచేత.

విమల నిజంగా అవతరించిన ప్రేమమూర్తియే. ఆమె నిజంగా ప్రసాదాన్ని మనసారా ప్రేమించింది. తన హృదయస్థ ప్రేమమూర్తిని ప్రసాదం పాదార్పితం చేసింది. తనహృదయంలో ఆతని హృదయం దాచుకోడానికి తానిచ్చింది. ప్రసాదంకూడా అల్లే ఆమెను చూసేవాడు. కాని ఎప్పుడూ అతను కలత పొందిన మనస్సుతో ఉండేవాడు. తనహృదయస్థ వ్యాకులాన్ని ఓపడాది రమారమీ దాచాడు. కమలతో ఎప్పుడూలేని సంతోషం తెచ్చుకొని భాషించేవాడు.

'పవిత్రపేమకంటె మించిన పరీక్షకర్త వేరొకటుందా?' ఆవిమలాప్రణయం ఇతని సితిని గ్రహించింది. కాని దానికి కారణం మాత్రం అగోచరంగావుంది.

లాకాలేజీ మూసారు వేసవిక్కై. సాయంత్రం ఐదయింది. ఇంట్లో ప్రసాదంజాడేలేదు. 'టీ' త్రాగడానికైనా రాలేదు. విమల ఆతురతతో అతనిగదిలోకిపోయిచూసింది. పెట్టె బిచాణా సర్దడంలో నిమగ్నుడయి యున్నాడు ప్రసాదం. ఆశ్చర్యంతో ఆమె 'ఇదంతా ఏమిటి' అంది. ప్రసాదం ఆమె వైపుతిరిగి విమలా, ఈరాత్రి మావూరు వెళ్తున్నాను. మళ్లి పదిరోజుల్లో వస్తాను.

'ఏమంత అర్జంటుప్రయాణం' అంది, 'నన్నుకూడా తీసుకెళ్తాన్నారే.'

'అందుకే ఈనాప్రయాణంముందుగాను.' సామానుసర్దడంలో ఆమెకూడా సాయం చేసింది.

'రేపో మా సీతారామయ్య మామయ్య వస్తాడు మదరాసు నాకోసం. రానీ, నేనుంటేగదా నాపూర్వాంలాడ్జిలోనన్ను చూడడానికి. ఇపుడు వెళ్లడంతోనే అన్నీ తెగతెంపూ చేస్తా. మూడోవంతు ఆదాయం దానికి పంపించేస్తా. అని వినీవినబడనట్టు అనుకుంటున్నాడు ప్రసాదం. రైల్లో ఇంటరు క్లాసుబండిలో.ఎంతలేసి ఉత్తరాలు వ్రాసింది, పద్మ? చదివితే రాళ్లుకూడా కరిగిపోతాయే! నేనంత కర్కశహృదయుడనయ్యాను! ఎన్నిసార్లుచదివిననూ తనివితీరదే! అనుకొంటూ పెట్టెతలుపుతీసి తన రహస్యఉత్తరాలసంచీకోసం వెదికాడు. కాని లాభం లేకపోయింది. బెంచీనిండా బట్టలూ పుస్తకాలు పరిచీశాడు. వెదికినవే వెదికాడు. తీసినవే తీసాడు. లాభంలేకపోయింది. ఓపెద్ద నిట్టూర్పుతో అన్నీ పెట్లోపడేశాడు. అన్నా ఎంత పనైపోయింది.? టేబిల్ మీాదా మర్చిపోయాను దాన్ని? విమలచూస్తే కొంప మునుగుతుందే? ఊఁ, కానీ! మాశ్యామానివని దబాయిస్తా! అనుకొంటూ నిద్రపోయాడట్లా.

తనఆస్థికి తనే యజమాని. రాగానే ఆస్తిని వంతులు వేయించేసాడు. ఓవంతు భార్యపేర వ్రాయించి రిజిష్టరుచేయించి ఆదస్తావేజులు మరి పద్మ తనవద్దకు రానవుసరం లేదనిన్నీ, తాను మరోవివాహంచేసుకొన్నానని వ్రాసిన ఓఉత్తరం పెళ్లాం పేర పంపేశాడు. ఇల్లంతా నవీనపద్ధతి ననుసరించి అలంకరింపజేసాడు. వీధిలోనూ పెరట్లోను పూలచెట్లూ మొదలైనవి పాతించాడు. మునపటికన్నా వేయిరెట్లానందంగా ఉన్నాడతనికి ఇప్పుడా ఇంట్లో ఉండడానికి. ఎప్పుడు మదరాసునుంచి ఉత్తరంవస్తుంది, ఎప్పుడు విమలను తీసుకురావడానికి వెళదాం అని స్వాతివానకు ముత్యపుచిప్పల్లాగు చూస్తున్నాడు ప్రసాదం విమలఉత్తరానికి.

ఆత్మహత్య !

బారిష్టరు రామకృష్ణారావునాయుడు గారికుమార్తె విమల (వయస్సు 19 సంll) ఈరాత్రి ఎనిమిదిగంటలకు విషముత్రాగి ఆత్మహత్య గావించుకొనెను. ఆమె ఈక్రింది ఉత్తరమును తనభర్త కందచేయుమని వ్రాసి ఉంచెను.

ఆర్యా!

నమస్కారములు—

నేనువ్రాసే ఈక్రింది కొలదిపంక్తులను సావధానచిత్తులై చదివి నా తుదికోరిక ప్రకారం మీారాచరించి నాఆత్మను శాంతిపరుప ప్రార్థిస్తున్నాను. నేనిట్టి సాహసకృత్యానికి గడంగితినని మీారు నాపై అలుగవలదని ప్రార్థన. మీారింకనూ పవిత్రమైనప్రేమ అననెట్టిదో ఎరగనికారణంచే ఇట్లు చేయవలసి వచ్చెను.

ఆహా! పద్మాదేవీ! సుశీలా! నీకు నా హృదయపూర్వకవందనములు. 'సీతారాం' నీవెంత మనోహరంగా ఉన్నావోయ్. ఆ దంపతులరూపం నీయందా విధాత ఎట్లు చిత్రించినాడు! అట్టివారిని నాకొరకా

మీరు త్యజించారు? ఎంత దారుణకృత్యం చేసారు! తమరు ప్రణయసౌఖ్యము పొందిన వారని తెలసిన నేను మిమ్ముల చేపట్టనన్న భయముచేతనా ఇట్లాచరించారు? ఆహా, నేనుకూడా ఆమట్టిబొమ్మనేకదా! నాకొరకు మీ ఆనందదాయకమగు సంసారమును మట్టిపాలుచేసారా ? అట్టి పతివ్రతామతల్లిని వేరుంచిరా? అట్టి ముద్దుపాపని చూడకుంటిరా? ఆమె ప్రణయతాపము-ఆమె ప్రణయ జ్వాల మనలను దహింపకుండుననుకొంటిరా?

'శీతారాం'—ఆముద్దుబాలుని ఛాయా చిత్రమైన మీహృదయాన్ని కరగింపలేదా. మాతాబాలు లెంతకృశించిరో గదా! దీని కంతటికిని మీకృత్రిమ ప్రేమయేగదా,— కాదుకాదు క్షమింపుడు, నాఈ అనిత్య వయోరూపమేకదా మూలకారణము.

మీసంసారవృక్షమును ఈ 'విమల' అనే వేరుపురుగేకదా నాశనంచేస్తూంది! అందు చేదీనికి ప్రతిక్రియ ఆవేరుపురుగును ధ్వంసము చేసి ఆవృక్షమును ఫలభరితముగా చేయుటయేగదా! అందుచే నేటితో ఈ విమల ఈ బాహ్యప్రపంచాన్ని విడుస్తూంది. ఎందుకొరకు ?—పద్మాప్రసాదుల ప్రణయ లతాభివృద్ధికొరకు !

తమరు నాఈ తుదికోర్కెను పాలింప ప్రార్థితులు. ఏమన నాయందు (అస్వాభావిక) ప్రేమచే మీరు విరాగులుగాక నా సోదరియగు పద్మాదేవియందు మునుపటి ప్రేమతో వర్తిల్లుచూ నాఆత్మకు శాంతి కల్గింప ప్రార్థించుచున్నాను. దీనికి ప్రతిఫలముగా నేను సదా నాసోదరియందు ప్రతి బింబించుచున్నాను.

నాచిట్టి 'శీతారాం'కు ముద్దులతోనూ పవిత్రులగు మీ పద్మాప్రసాదులకు నాతుది వందనములతోను ముగించుచున్నాను.

మీపదదాసి,

విమల.

ఈ ఉత్తరం శ్యామంచదివి వినిపించాడు ప్రసాదానికి 'ఆంధ్రపత్రిక'లోంచి. ప్రసాదం వెర్రెత్తినవాడిలా బెదరినచూపుల్తో చూస్తున్నాడు. తనంతటతాను మళ్లీచదివాడు. ఈసారి ఆడదానికన్నా వేయిరెట్లధికంగా ఏడుస్తున్నాడు. అట్లాగే తెలివితప్పేడు.

ఓగంటదాకా తెలివిరాలేదు. తెలివి వచ్చాక ఓదార్చాడు 'శ్యామం' ప్రసాదాన్ని. వారిరువురు కనులుమూసికొని 'విమల'ను ధ్యానించారు ఓ రెండునిముషాలు. ప్రసాదం కళ్లలోంచి బయలుదేరాయి అశ్రుకాలువలు. ఆమె త్యాగానికాశ్చర్యపోయాడు పశ్చాత్తాపంవచ్చింది వెంటనే అతనికి. * *

'పద్మాప్రసాదం'లు మునపట్లా చిలుకాగోరింకల్లాగున్నారు. ప్రసాదం విశాఖపట్నంలో బోర్డుకట్టాడు. ఇప్పుడు వాళ్ల ప్రేమ లతకు 'విమలా' పుష్పం పూసింది.